విశాలాంధ్ర

శ్రీకాకుళం

శుక్రవారం 11, ఏప్రిల్, 2025

అప్పుల బాధలు భరించలేక కౌలు రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-కంచిలి: కంచిలి మండలం పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన బల్లెడ నరసింహమూర్తి(58) పురుగుల మందు తాగి ఆత్మహత్య కి పాల్పడ్డారు. ఇటీవల కాలంలో వ్యవసాయంలో నష్టం వచ్చి సుమారు గా పది లక్షల వరకు అప్పులు చేశారని బోగట్టా, అప్పులు ఇచ్చిన వాళ్ళు పలుమార్లు అడగడం తో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. నరసింహ మూర్తి ఈ క్రమంలో బుదవారం ఉదయం పది గంటల సమయం లో ఇంటి నుంచి బయటకు వచ్చిన నరసింహమూర్తి రాత్రి అయినా ఇంకా ఇంటికి రాకపోవడం తో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి వేదికారు. జీడి తోటలో జీడి, కొబ్బరికి కొట్టే పురుగులు మందు తాగి ఆత్మహత్య కి పాల్పడి విగత జీవిగా పడి ఉన్న నరసింహ మూర్తి ని చూసిన భార్య మరియు కుటుంబ సభ్యులు బోరున విలపించారు. భార్య నీలవేణి(52) అలానే ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలు

సకాలంలో అందించాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: వెనుకబడిన కులాలకు, షెడ్యూల్ కులాలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలని రుణాలు మంజూరు, వసతి గృహాలు నిర్వహణ, పూర్తిస్థాయిలో జరగాలని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు, బిసి కార్పొరేషన్ ఆఫీసర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ రుణాలు అర్హులైన వారికి న్యాయంగా అందించాలని, వారి ఆర్థిక పురోభివృద్ధి కి సహకరించే విధంగా జరగాలన్నారు. బీసీ వసతి గృహాలు, ఎస్సీ హాస్టల్స్ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పరిస్థితులు కల్పించాలని, ఇబ్బందులు లేకుండా నిర్వహణ చేయాలన్నారు. పేద విద్యార్థులు హాస్టల్ ల ఉండి విద్య నేర్చుకుంటున్నారని అటువంటి విద్యార్థి విద్యార్థులకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్య తో పాటు మంచి భోజన సదుపాయం కూడా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన వారిని గుర్తించి వారికి న్యాయం జరిగే విధంగా రుణాలు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి నాలుగు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-టెక్కలి: గ్రామాల వారీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే

పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. టెక్కలి మండల కేంద్రంలోని గురువారం డివిజన్ కార్యాలయంలో టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్‌కి చెందిన రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే, పీజీఆర్ఎస్, పౌర సేవల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. మ్యూటేషన్, ఆస్తుల తగాదాల పరిష్కారానికి రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా వినియోగించాలన్నారు. రీసర్వేలో ఎదురవుతున్న అభ్యంతరాలను వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులను ఎస్ఎల్ఏ గడువు దాటిపోకుండా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఇంటి స్థలాల పట్టాల వెరిఫికేషన్, నీటి పన్ను వసూలు వంటి అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, టెక్కలి ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి, పలాస ఆర్డీవో తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎల్.ఐ.పి. అమల్లో ఉత్తమ వర్శిటీగా డా.బీఆర్ఏయూ

- ప్రశంసలందుకున్న బి.సి.డి.ఈ. సమన్వయకర్త

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్(ఎల్.ఐ. పి.) అమలులో రాష్ట్ర స్థాయిలో డా. బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉత్తమ ప్రతిభ కనపరిచింది. ఈ మేరకు, వర్శిటీ బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రూ ఎడ్యుకేషన్ (బి.సి.డి.ఈ.) సమన్వయకర్త డా. బలగ అజయ్ కుమార్ కు గురువారం విజయవాడలో జరిగిన "యూనిసెఫ్- ఎల్.ఐ. పి. ప్రాణమిత్ర'పై జరిగిన కార్యశాలలో సన్మానించి ప్రశాంసాపత్రాన్ని అందజేశారు. డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో ఎల్.ఐ. పి. పట్ల అవగాహన కల్గిస్తూ పలు కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహణలో డా. బీఆర్ఏయూ ముందుంజులో ఉండటంతో అజయ్ కుమార్ ను ఉత్తమ అధికారిగా గుర్తించారు. రాష్ట్ర సమగ్రశిక్షా అభియాన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు అజయ్ కుమార్ ను సన్మానించారు. కాగా, రాష్ట్రంలో ఎల్.ఐ. పి. అమలులో ఎంపికైన నాలుగు యూనివర్శిటీలో డా. బీఆర్ఏయూ ఒకటి. వర్శిటీకు ఈ గుర్తింపు తీసుకువచ్చినందుకు కృషి చేసిన అజయ్ కుమార్ ను యూనివర్శిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాతలు ప్రత్యేకంగా అభినందించారు.

ఐటిడిఏ పాఠశాలలకు నిర్వహణ భారం..ఖర్చులు చెల్లింపులో జాప్యం..!

విశాలాంధ్ర-మందస: శ్రీకాకుళం జిల్లా సీతంపేట గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో ఉన్న అప్పర్ ప్రైమరీ ఉన్నత గిరిజన ఆశ్రమ పాఠశాలలకు ప్రభుత్వం నిర్వహణ మెయింటెనెన్స్ ఖర్చులు పేరిట డబ్బులు చెల్లించకపోవడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చేతివాటం తప్పడం లేదు. గత రెండేళ్లుగా మెయింటెనెన్స్ నిర్వహణ నిధులు చెల్లించకపోవడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులే నిర్వహణ కోసం పెట్టుబడులు పెడుతున్నారు. ప్రభుత్వం ప్రతి ఏడాది రవాణా ఖర్చుల కింద ఒక్కొక్క పాఠశాలకు 25 వేల రూపాయలు చెల్లిస్తుంది.ఈ డబ్బులతో పాఠశాల పరిశుభ్రత కోసం, సుద్ద మొక్కలు, చీపుర్లు, డస్టర్లు మరుగుదొడ్లు బాత్రూంలో క్లీనింగ్ మెటీరియల్ మరియు పాఠశాలల కోసం వివిధ రకాల పుస్తకాలు రికార్డులు కొనుగోలు కోసం ఖర్చు చేయాలి. ప్రభుత్వం ఈ ఆర్థిక చేయూత అందచేయక పోవడంతో ప్రధానోపాధ్యాయులు కొన్నిచోట్ల డిప్యూటీ వార్డెన్ల సహకారంతో మెటీరియల్స్ ను కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలకు నిర్వహణ ఖర్చులు కింద ఒక్కొక్క పాఠశాలకు 25 వేల రూపాయలు చొప్పున ప్రతి ఏడాది ప్రభుత్వం జాప్యం లేకుండా చెల్లిస్తున్నప్పటికీ ఐటిడిఏ పాఠశాలలపై కన్నెత్తి చూడకపోవడం తో ప్రధానోపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజయలక్ష్మికి ఎఎంసీ కిరీటం

సోంపేట ఏఎంసి ఛైర్మన్ పదవి ఖరార్?

మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరావు సేవలకు పట్టం

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి సోంపేట మండల టీడీపీ అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు సతీమణి మద్దిల విజయలక్ష్మికి ఖరారైంది. ఈ మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి విశ్వసనీయ సమాచారం అందింది. మరో రెండు మూడు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడనుంది. కవిటిలో గల ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పార్టీ కార్యాలయంలో సోంపేట, కంచిలి మండలాల కూటమి నేతలు చర్చలు అనంతరం దశాబ్ద కాలం పైగా మండల టీడీపీ అధ్యక్షునిగా సేవలందిస్తున్న నాగేశ్వరరావుకు ఈ విషయంలో పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. పార్టీకి అంకితబద్దుడుగా ఉంటూ సుమారు 13 ఏళ్లుగా పార్టీ మండల అధ్యక్షునిగా కొనసాగుతూ కార్యకర్తలను, వివిధ వర్గాలను ఉత్సాహ పరుస్తూ పార్టీ అధికారం కోసం నిరంతరం చిత్తశుద్ధితో కృషి చేస్తోన్న నాగేశ్వరరావు సేవలను తెలుగుదుశం పార్టీ మళ్లీ గుర్తించింది. ఇంత కాలం పార్టీ బాధ్యతలనే అప్పగిస్తూ వస్తున్న తెలుగుదేశం పార్టీ ఎట్టకేలకు ఆయన సేవలను గుర్తించి ఎఎంసి పదవి మహిళా కోటా కింద కేటాయించడంతో ఆయన భార్య విజయలక్ష్మికి కేటాయించారు. ఇదిలా ఉండగా గతంలో వైసీపీ ప్రభుత్వంలో సోంపేట, కంచిలి మండలాల పరిధిలోకి వచ్చే సోంపేట ఏఎంసిలో యాదవ సామాజికవర్గానికి అవకాశం కల్పించగా అదే తరహాలో తెలుగుదేశం పార్టీ కూడా ప్రస్తుతం యాదవ సామాజికవర్గానికి అవకాశం ఇచ్చింది. మండలంలో అగ్నికులక్షత్రియ, మత్స్యకార, కాపు, సామాజికవర్గాలు కూడా పెద్దసంఖ్యలోనే ఉన్నప్పటికీ తొలిదశ నామినేటెడ్ పదవుల్లో మాత్రం యాదవ సామాజికవర్గానికి అగ్రతాంబూలం ఇవ్వడం విశేషం. రానున్న నామినేటెడ్ పదవుల్లో మిగతా సామాజికవర్గాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. ఇప్పటికే పార్టీ వర్గాల్లో ఏఎంసి పదవి ఖరారుపై చర్చ సాగడంతో విజయలక్ష్మి కేటాయించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. ఎఎంసి వైస్‌చైర్మన్, డైరెక్టర్ల పదవులను జనసేన, బిజెపి పార్టీల సభ్యులకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది.

జనావాసాలకు

భారీ కింగ్ కోబ్రా

విశాలాంధ్ర-మందస: మండలం భోగాపురం గ్రామం దళిత వాడలో గురువారం వేకువ జామున 12 అడుగుల భారీ కింగ్ కోబ్రా సంచరించడంతో గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయాన్ని సమీపంలో ఉన్న కొర్లాం గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ నర్సింగ్ మహాపాత్రో దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన గ్రామానికి వచ్చి కింగ్ కాబ్రాను పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. కింగ్ కోబ్రా బరువు సుమారు 10 కేజీలు ఉంటుందని అంచనా.

ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

విశాలాంధ్ర-సోంపేట: ఆంధ్రప్రదేశ్‌లోని 164 ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరమునకు 6వ తరగతిలో విద్యార్థులను చేర్చుకొనుట ఈ నెల 20 ఆదివారము రాష్ట్రవ్యాప్తముగా జరగబోవు ప్రవేశ పరీక్ష ఈస్టర్ పర్వదినం సందర్భంగా 21వ తేదీనకు మార్చబడినట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున దయచేసి ఈ ప్రవేశ పరీక్ష తేదీ మార్పుని గమనించి ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తేదీ 21.04.2025 ఉదయం 10 నుండి 12 గంటల వరకు నిర్వహించబడే ప్రవేశ పరీక్షకు హాజరుకాగలరు. విద్యార్థులు హాల్‌టికెట్స్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవలెను. పరీక్షపై అవగాహన తరగతిని 16వ తేదీ ఉదయం 9 గంటలకు మోడల్ స్కూల్ సోంపేటలో నిర్వహించబడుతుందని తెలిపారు.

మీ పిల్లల్ని..ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

విశాలాంధ్ర-నరసన్నపేట: మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండని మండల విద్యా శాఖాధికారులు 1,2, యు.శాంతా రావు, పి.దాలినాయుడు అన్నారు. గురువారం మండలంలోని చెన్నాపురం గ్రామంలో ఉదయం 7గంటల నుండి ఎం.ఈ.ఓలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కలిసి, ప్రతీ ఇంటికీ వెళ్ళి, చదువుకునే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎం.ఈ.ఓలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, షూస్, సాక్స్, మధ్యాహ్న భోజనం, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారి ఆరోగ్యం మెరుగుకు కృషి చేస్తున్నారని అన్నారు. అలాగే ఉచితంగా బట్టలు పంపిణీ, బెల్ట్, బ్యాగులు, తల్లికి వందనం పేరుతో బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నాపురం పాఠశాల హెచ్.ఎం, డి.శంకరనారాయణ, ఉపాధ్యాయులు, ఎన్.వేణుపూర్ణమ్మ, జి.శంకరరావు, జి.తారక్, పి.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగోవిందపుట్టుగ యువకుడికి రెడ్‌క్రాస్ మెడల్



విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం ఎర్రగోవింద పుట్టుగ గ్రామానికి చెందిన ఈపరి రమణమూర్తి అనే యువకుడు 2006 సంవత్సరం నుండి నేటి వరకు తమ సంస్థ ద్వారా రక్తదాన సేవలు చేసి 23 సార్లు రక్తదానం పేదల ప్రాణాలను కాపాడినందుకు శ్రీకాకుళంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు ఐఆర్సీఎస్ మెడల్తో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగిపోతున్న శ్వాసకి నీ రక్తంతో ప్రాణం పోసిన నీవు ఎంతో మంది యువతకు ఆదర్శమని కొనియాడారు.

నిబంధలకు వ్యతిరేకంగా పాఠశాల నిర్వహణ

- ప్రైవేట్ పాఠశాలను సందర్శించిన ఏబీవీపీ నాయకులు.
- విద్యార్థులకు రెండో పూట కూడా బడులు నిర్వహణ.
- ఎంఈఓ కి ఫిర్యాదు... నోటీసులు జారీ..

విశాలాంధ్ర-టెక్కలి: వేసవి దృష్ట్యా ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తరలో జారీ చేసిన విషయం అందరికీ తెలిసినదే. అయితే ప్రభుత్వ నిబంధనలను ఓ ప్రైవేట్ పాఠశాల మాత్రం అతిక్రమించిందని ఏబీవీపీ సంఘ నాయకులు గురువారం తనిఖీలు నిర్వహించి ప్రశ్నించారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని స్థానిక రోటరీ నగర్ సమీపంలో ఓ ప్రైవేటు పాఠశాల అమ్మ ఒడి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా రెండు పూటలా విద్యా తరగతులు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు ఏబీవీపీ నాయకులు పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. రెండో పూట కూడా విద్యార్థులకు బడులు నిర్వహించమని ఎవరు చెప్పారని పాఠశాల యాజమాన్యానికి ప్రశ్నించారు. దానికి యాజమాన్యం మాట్లాడుతూ ఇవి క్లాసులో కాదని, తల్లిదండ్రులు అనుమతులు ప్రకారం రెండు గంటల అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం స్పష్టంగా తెలియపరిస్తే తమ పాఠశాలలో ఇలా చేయడం సరికాదని



ఏబీవీపీ నాయకులు మండిపడుతూ.. మండల విద్యాశాఖ అధికారి కి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎంఈఓ తులసీరావు పాఠశాలను సందర్శించి యాజమాన్యంతో మాట్లాడారు. అంతనా పొంతనా సమాధానాలు చెప్పడంతో ఆ పాఠశాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఉదయం 7:45 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు విద్యా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ఆరోగ్యాలతో ప్రైవేట్ పాఠశాలలు, సంస్థలు చలగాటలాడుతున్నారని దీనిపై ఉన్నత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మురళి, సోషల్ మీడియా స్టేట్ కో- కన్వీనర్ శ్యామ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే మామిడి

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం: గురువారం పాతపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణము లో నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గంలో నైపుణ్యం ఉన్నత విద్య అభ్యసించినప్పటికి నిరుద్యోగులు వేలాది సంఖ్యలో ఉన్నారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తుందని ఇటువంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని యువతీ యువకులు ఆయా పరిశ్రమంలో ఉద్యోగం సాధించడం ఎంతో గొప్ప విషయమని, వెనుకబడిన నియోజకవర్గంలో ఇటువంటి జాబ్ మేళాలు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న అరబిందో, అపోలో, టైర్స్‌తోపాటు సుమారు 15 కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్ మేళా ను నిర్వహించారని తెలిపారు. పాతపట్నం, మెలియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్ ఎన్‌పేట తో పాటు పలు గ్రామాల నుంచి సుమారు 650 మంది యువకులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యారని వారికి ఆసక్తి ఉన్న ఉద్యోగంలో వారు చేరాలని యువతకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాములు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సాయి,ఎంప్లాయిమెంట్ అధికారిని సుధారాణి, సెట్ సీఈవో ప్రసాద్ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సర్వ వ్యాధి నివారణ హోమియోతో సాధ్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఒత్తిడి, ఆందోళన లేకుండా ఆనం దంగా జీవించడానికి హోమియో వైద్యం ఒక్కటే ఉపకరిస్తుందని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, గుడ్ల సత్యనారాయణ, గుడ్ల జగ్గారావు లు అన్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఏకైక వైద్య విధానం హెూమియోతో సాధ్యమన్నారు. గురువారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రపంచ హెూమియో దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రతీ ఒక్కరూ ఒత్తిడి, ఆందోళనకు గురి కావడం ఖాయం అని, ఈ తరుణంలో అనేకరకాల వ్యాధులు దరి చేరుతాయని, వీటి నుండి ఉపశమనం పొందాలంటే హెూమియో వైద్యం ఒక్కటే శరణ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల లక్ష్మీ, అడపా శాంతి, వానపల్లి జ్యోతి, ఎన్. ఉపేంద్ర, ఎం. మల్లిబాబు, నంధిగాన కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-రణస్థలం: 33/11కెజీ రణస్థలం సబ్-స్టేషన్ మరమ్మతులు కొరకు 33/11 కెవీ రణస్థలం సబ్-స్టేషన్ పరిధిలోనీ అన్ని గ్రామాలకు అనగా జెఆర్ పురం, రణస్థలం, రావాడ, కొండ మూలగం, కమ్మ సిగడాం, వేలుపురాయి, దేవరపల్లి, అర్జునవలస, ఎం. నగరపాలెం, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నానపాలెం, సంచాం గ్రామాలకు తే 11.04.2025 ది శుక్రవారం ఉదయం 08.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీకాకుళం ఈ ఈ పి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజన సమస్యలు పరిష్కరించండి...

27న రాష్ట్రపతితో భేటీ

విశాలాంధ్ర-జలుమూరు: సీతంపేట ఐటీడీఏ పరిధిలోగల అనేక గిరిజన గ్రామాలకు కనీసం మౌలిక సదుపాయాలు లేకపోవడం బాధాకరమని గిరిజన ఐక్యవేదిక సంఘ నాయకులు చౌదరి లక్ష్మీనారాయణ, జన్ని రామారావు సవర దుర్గారావు ఆవేదన వ్యక్తపరిచారు. గురువారం సాయంత్రం సారవకోట మండలం మహా సింగ్ పంచాయతీ కన్నయ్యగూడ గ్రామాన్ని వారు సందర్శించారు. అక్కడ కనీసం మౌలిక సదుపాయాలు తాగునీరు కూడా లేకపోవడంతో నేతలు ఫేవరెట్ ఇబ్బందులు ఆవేదన చెందారు. స్వాతంత్రం సిద్ధించి దశాబ్దాలు గడుస్తున్న గిరిజన పేర్లతో కోట్లాది రూపాయలు విడుదలవుతున్న గ్రామాల్లో చేరడం లేదని లక్ష్మీనారాయణ ఐక్యవేదిక సభ్యులు ఆవేదన వ్యక్తపరిచారు. గతంలో సీతంపేట గిరిజన అభివృద్ధి సంస్థ ఉండేటప్పుడు కాస్త కాస్త సమస్యలు పరిష్కారం అయ్యేవని నేడు సీతంపేట నుండి విజయనగరం జిల్లాకు చేరడంతో ఈ జిల్లాలో గిరిజనులు అన్యాయానికి బలవుతున్నారని, లక్ష్మి నారాయణ మానవతా దృక్పథంతో పోడు వ్యవసాయం చీపుర్లు వ్యాపారం చేసుకొని కుటుంబాలను పోషిస్తున్న గిరిజన సమస్యలపై అధికారులు పాలకులు కన్ను వేసి కనీసం మౌలిక సదుపాయ సమస్యల పరిష్కరించాలని నేతలు కోరారు.

ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస మండలం బెలమం గ్రామంలో యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో, ఎస్ ఎస్ టి వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తాడివలస ఏపీజీవీబీ బ్రాంచ్ మేనే జర్ టీ అంకాల్ మాట్లాడుతూ సైబర్ మోసల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఎ పి వై అటల్ పెన్షన్ యోజన పథకం 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలు ఉన్న వ్యక్తులు కొంత అమౌంట్ను బ్యాంకుల్లో దాచుకున్నట్లయితే వృద్ధాప్యంలో బ్యాంకుల ద్వారా 60 సంవత్స రాలు పైబడిన వ్యక్తులకు పెన్షన్ అనేది వెయ్యి 1000 నుండి 5000 వరకు ఇవ్వడం జరుగు తుంది అని తెలిపారు. అలాగే పియంజెజెవై, పియంయస్బివై ఇన్సూరెన్స్ ల కోసం బ్యాంక్ ఇంటిగ్రేడ్ అంబుడ్స్ మాన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలనీ సూచించారు. ఎటిఎం కార్డ్స్ వల్ల కలిగే ఉపయోగాలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సోషల్ సొసైటీ ట్రాన్స్ఫర్మేషన్ సిబ్బంది చిగురు పల్లి వెంకటేష్ (చిన్ను) జిల్లా కోర్డనేటర్ ఎ హర నాథ్ లీడ్ బ్యాంకు ఎఫ్ఎల్సి సువ్వారి రవి బాబు, సీ ఎఫ్ విజపావని, బిసి బి జగ్గమ్మ, కార్యక్రమాన్ని సిఎఫ్ఎల్ సిబ్బంది బొడ్డేపల్లి చంద్రశేఖర్ నిర్వహించారు.

ఇండియన్ నేవీ కి మేఘన ఎంపిక

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని ముత్యాలపేట గ్రామానికి చెందిన పొల్లాయి మేఘన ఇండియన్ నేవీ, అగ్ని వీర్ లో కస్టమ్స్ ఆఫీసర్స్ డిపార్ట్ విభాగం కు ఎంపిక అయినట్లు తల్లిదండ్రులు పొల్లాయి హేమారావు, పోల్లాయి చామంతి తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్ లో ఇంటర్మీడియట్ వరకు చదివి బి ఎస్ సి పూర్తిచేసి కస్టమ్స్ ఆఫీసర్స్ డిపార్ట్ విభాగంకు ఎంపిక అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మేఘన కు తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

ఐసిడియస్ ప్రాజెక్ట్ వారి 'ఊయల' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్

విశాలాంధ్ర-రణస్థలం: స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ - ఐ.సి.డి.యస్. ప్రాజెక్ట్ రణస్థలం వారి ఆధ్వర్యంలో గురువారం రణస్థల మండల కేంద్రంలో సీహెచ్‌సీ-కొండములగాం నందు "ఊయల" కార్యక్రమం జరిపిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసి పిల్లలను వద్దనుకుంటే ఊయలలో వేసి రక్షించండి" ఆడ పిల్లలని, అనారోగ్యవంతులని, అంగవైకల్యం కలవారని లేదా అవాంచిత గర్భం వలన పుట్టిన పసి పిల్లలను వద్దనుకుని వారిని చెత్త కుండీలు, ముళ్ళ పొదలు లేదా బయట పారవేయకుండా ఈ "ఊయల' లో వేయవలెను. వారిని స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ వారి శిశు గృహలో సంరక్షించి పిల్లల కొరకు ధరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం జరుగుతుంది. అనంతరం భాలింతలను పరామర్శించి పండ్లను పంపిణీ చేసియున్నారు. పసి పిల్లలకు 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టాలని వాటి ఉపయోగాలను వివరించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్ . ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ పి ఓ ఝాన్సీ పిసిని జగన్నాథం నాయుడు, దన్నాన సత్తిబాబు, సీహెచ్‌సీ మాజీ చైర్మన్ వెలిచేటి సురేష్, హాస్పటిల్ డైరెక్టర్ దన్నాన స్వామి నాయుడు, ఎంపిటిసి దన్నాన వంశీ, దన్నాన రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: పట్టణంలో విశాఖ డెయిరీ వెనుక ప్రాంతంలోని కాలనీ వద్ద ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఎన్నె జనార్ధనాచార్యులు, నరసింహమూర్తి ఆచార్యులు శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠను చేపట్టారు. స్థానికుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ జ్యోతి ప్రజ్వలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన్ని స్థానికులు పట్టు వస్త్రంతో సత్కరించి, తమ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరిపించాలని కోరారు. కార్యక్రమంలో కె. ప్రసాద్, యు.ఖగభూషణ్, వై.బాలగోపాలం, లక్ష్మణ్ రవి, అరుణ్‌లతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఆశి లీలారాణి, కాళ్ళ దిలీప్, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్.కోటి, కె. ధర్మరాజు, కొండా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నింగినంటుతున్న నిత్యవసర ధరలు

- ఒక్కసారిగా వంటగ్యాస్ ధరలు రూ.50లు పెంచడం దారుణం
- వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేసిందని నిత్యావసరాల నుంచి కూరగాయలు, వంట నూనెలు పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది చాలదన్నట్లుగా ఒక్కసారిగా వంటగ్యాస్ ధరలు రూ.50లు పెంచడం దారుణమని, పెంచిన ధర లను వెంటనే తగ్గించాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం పాతపట్నం లో విలేకరుల సమావేశంలో అన్నారు. అధికారం చేజిక్కగానే పేద, మధ్య తరగతి నడ్డి విరిచేలా భారం మోపడం సరికాదు. ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి నిత్యావసర వస్తువులు, పప్పులు, కూరగాయల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రభుత్వం ధరల నియంత్రణలో పూర్తిగా విఫలం అయింది. నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగి భారంగా మారినా కొనుగోలు చేయక తప్పడం లేదు. ఇప్పుడు మరలా వంట గ్యాస్పై పెంచడం వలన సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేయాలను కుంటే మంచి మనస్సు ఉండాలన్నారు అది ఒక్క జగనన్నకు సాధ్యం అన్నారు. అధికారం చేపట్టి 10 నెలలు అవుతున్నా... మహిళ లకు ఎందుకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించ లేదని నిలదీశారు. ప్రజలను మోసం చేయటం సీఎం చంద్రబాబుకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదన్నారు. వైఎస్ జగన్మో హన్రెడి హయాంలో సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు క్యాలెండర్ను ముందుగానే ప్రకటించి, ఆయా తేదీల వారీగా లబ్దిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోవటం లేదని, సంక్షేమ పథకాలు అమలు కావట్లేదని కూటమి ప్రభుత్వ పాలనపై రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలియజేశారు. అనంతపురం జిల్లా పాపిరెడ్డి పల్లెలో మంగళవారం జరిగిన పర్యటనలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం దారుణమన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన సెక్యూరిటీ ఇవ్వలేదని ఆరోపించారు. ప్రతిపక్ష నేత భద్రత విష యంలో కూటమి సర్కారు అనుసరిస్తున్న వైఖరిపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

రాత్రి వేళల్లో అక్రమ మట్టి త్రవ్వకాలు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గంలో ప్రకృతి ప్రసాదించిన కొండలు, గుట్టలు దోచేస్తున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారు. పది మందికి ఉపయోగపడే చెరువులను కూడా అక్రమార్కులు వదలడం లేదు. అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా వారికి అడుగులు మడుగులు ఒత్తుతూ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు చోటా నేతలు.. వజ్రపుకొత్తూరు మండలం సీతపురం బొడ్డపాడులో గల యర్ర చెరువుపై ఓ నేత కన్ను పడింది.. ఇంకేముంది.. పది మందికి ఉపయోగపడే చెరువును ఖాళీ చేసే పనికి తయారయ్యాడు ఆ గ్రామ పెద్ద..చెరువు నుంచి రాత్రి వేళల్లో మట్టి తవ్వి సమీపంలోని రియల్ వెంచర్ల కు, ఇటుక బట్టీ లకు తరలించే పనులు చకచకా చేపడుతున్నారు. గ్రావెల్ మాఫియా నేత చెరువును కబళిస్తున్నాడని తెలిసిన అడ్డు చెప్పే ధైర్యం చాలక అధికారులు చేష్టలుడిగి చూస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. మండల కేంద్రానికి కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద బొడ్డపాడు పంచాయతీ సీతాపురం గ్రామం పరిధిలోని ఎర్ర చెరువు లో గత కొద్ది రోజులుగా రాత్రి వేళల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. జెసిబి లు పెట్టి పెద్ద పెద్ద

గ్రావెల్ మాఫియా ఇష్టారాజ్యం
రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మౌనం..!

గుంతలు తవ్వి ట్రిప్పర్లు ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. అధికార పార్టీ అండ ఉండడంతో అడ్డు చెప్పే వారే కరువయ్యారని విమర్శలు వినబడుతున్నాయి. రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ఇటుక బట్టీలకు మట్టి అవసరం ఉండడంతో ఈ గ్రావెల్ మాఫియా చెరువు మట్టితో వ్యాపారం చేస్తున్నారు. ట్రాక్టర్ మట్టిలోడు వెయ్యి రూపాయలకు పైగా పలుకుతుండడంతో ప్రస్తుతం మట్టి వ్యాపారం మూడు పూలు..ఆరు కాయలు.. చందంగా సాగుతోంది. చెరువుల్లో యంత్రాలతో ఎటువంటి త్రవ్వకాలు జరుపకూడదని నిబంధన ఉన్నప్పటికీ మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా చెరువుల్లో తవ్వకాలు జరుపుతున్నారు.

దీంతో పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడి, భవిష్యత్తులో చెరువు లోకి నీరు నిండిన తర్వాత ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల్లో జేసిబి లతో మట్టి తవ్వకాల వలన ఏర్పడ్డ గోతుల్లో పడి మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయని గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. చెరువు మట్టితో లక్షలాది రూపాయలు సంపాదిస్తున్న గ్రావెల్ మాఫియాపై అటు రెవిన్యూ ఇటు పోలీస్ అధికారులు దృష్టి సారించకపోవడంతో వారూ ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని పర్యావరణ వేత్తలు ఆరోపిస్తున్నారు. మండలంలో చెరువులతో పాటు కొండలను కూడా కొల్లగొడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. చెరువులు, కొండలు వంటి ప్రకృతి వనరులపై అధికారులు దృష్టి సాధించకపోతే భవిష్యత్తులో కనుమరుగయ్యే ప్రమాదం ఉందంటున్నారు.

నరసన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

సిఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి విజ్ఞప్తి

విశాలాంధ్ర-నరసన్నపేట: నియోజకవర్గంలో పలు సమస్యలు ఉన్నాయని, వాటి పట్ల దృష్టి సారించి, నరసన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి, రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందచేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సి.ఎం, చంద్రబాబును కలిసి, టీడిపి హాయాంలో ప్రారంభమైన మినీ ఇండోర్ స్టేడియం పనులు నిలిచిపోయాయని, స్టేడియంకు సంబంధించి, ఇంటర్నల్ పనులు ఇంకా చేపట్టాలని, దాంతో పాటు విద్యుదీకరణ, నిర్వహణ సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే రాజుల చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో భాగమైన ప్రసూతి వార్డు నిర్మాణ పనులు వేగవంతం చేసే దిశగా నిధులు మంజూరు చేయాలని కోరారు.

కనకదుర్గ అమ్మవారును దర్శించుకున్న ఎమ్మెల్యే, రమణమూర్తి

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచిసి యున్న శ్రీ కనకదుర్గ అమ్మవారును గురువారం ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో ఆయన ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం ఆలయ వేద పండితులు, ఈ.ఓ దుస్సాలువతో ఎమ్మెల్యే, రమణమూర్తిని సత్కారం చేసి, ఆశీర్వచనాలు చేసి, తీర్థ, ప్రసాదాలు అందచేశారు.

మందస గిరిజన ప్రాంతాలలో జనం కోసం జనసేన

విశాలాంధ్ర-మందస: జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాటలో పలాస నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు అడుగులు వేస్తున్నారు. మందస మండలంలో గిరిజన గ్రామాలను సందర్శించి పిల్లలకు బట్టలు, స్టేషనరీ మరియు ఆహార పదార్థాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి దిలీప్ పాణిగ్రాహి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించగా గిరిపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వారి జీవితాలను మెరుగుపరచుకోవడానికి అవసరమైన సహాయం చేయడానికి ముందుకు వస్తున్నారు. జన సైనికులు ముందుగా కుమ్మరికుటియా గ్రామం నుండి దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు కోన కృష్ణారావు, వజ్రపుకొత్తూరు క్లస్టర్ ఇంచార్జ్ దువ్వాడ వంశీ కృష్ణ చౌదరి, జిల్లా సంయుక్త కార్యదర్శి మరియు నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్ లావేటి సురేష్, మహేష్ బమ్మిడి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించండి: మాజీ ఎంపీపీ రామకృష్ణ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: ప్రైవేటు పాఠశాలల్లో లేని సౌకర్యాలు నేడు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నందున గ్రామస్తులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ కోరారు. తమ స్వగ్రామం తిలారులో మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులతో కలిసి పాఠశాలలో విద్యార్థుల నమోదుపై గురువారం ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతూ తిలారు పాఠశాల మోడల్ ప్రైమరీ పాఠశాల గా మారుతుందని, ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడు ఉంటారని, విద్యార్థులు కు మరింత మెరుగైన బోధన అందుతుందని వివరించారు. ప్రభుత్వం తరఫున పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్, బూట్లు, బ్యాగులు, తల్లికి వందనం లో నగదు అందించడం జరుగుతుందని తెలిపారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలకు పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్ ఏ ఎస్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం మేఘవరం పంచాయితీ సూరాడవానిపేట, పాతమేఘవరం గ్రామాల్లో గురువారం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పనులు మాజీ సర్పంచ్ పరపటి రాజశేఖర్ రెడ్డి, తెలుగు యువత ఉపాధ్యక్షులు సూరాడ రాయుడు, వంక సోమేశ్వరరావు, సూరాడ ధనరాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నందుపిల్లి రామారావు, బైపల్లి కుమారస్వామి, సిరిగిడి కొండలరావు, కొండ భాస్కరరావు, చెంచయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సాగర్ కవచ్ ప్రాంతాలను పరిశీలించిన ఎస్ఐ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటుచేసిన సాగర్ కవచ్ పాయింట్లను సంతబొమ్మాళి ఎస్సై వై. సింహాచలం గురువారం పరిశీలించారు. సముద్ర యానం ద్వారా, రైలు ద్వారా, వివిధ ప్రయాణ సాధనాల ద్వారా అపరిచిత వ్యక్తులు ను గుర్తించేందుకు పాయింట్లు ఏర్పాటు చేసి పోలీసులను నియమించడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఇందులో భాగంగా కోటబొమ్మాళి ఆర్ఎస్, మలగాం, పాతమేఘవరం, లక్కీవలస, బోరుభద్ర, జగన్నాథపురం, ఉమ్మిలాడ లో ఏర్పాటు చేసిన పాయింట్లను పరిశీలించారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

పంచాయితీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయితీ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ప్రారంభోత్సవం చేశారు. పట్టణంలో ప్రభుత్వ కళాశాల జంక్షన్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని మేజర్ పంచాయితీ సర్పంచ్, వైస్ సర్పంచ్, బురల్లి శంకరరావు, సాసుపల్లి కృష్ణబాబు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజానీకానికి వేసవిలో మంచినీరు అందించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ ఈఓ, పి.ద్రాక్షాయిణి, వార్డు మెంబర్లు, కె.సిహెచ్.బి.గుప్తా, రఘుపాత్రుని శ్రీధర్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

పైలా వాసుదేవరావు వర్ధంతి సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-నరసన్నపేట: శ్రీకాకుళం గిరిజన సాయిధ రైతాంగ పోరాట విప్లవ యోధుడు, అజ్ఞాత సూర్యుడు, కామ్రేడ్ పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులు, నేతింటి నీలంరాజు కోరారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ పలాసలోని అప్పయ్య దొర ఇంటి సమీపంలో ఉన్న స్థలంలో వర్ధంతి వేడుకలు నిర్వహించటం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, విప్లవ అభిమానులు విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం, జిల్లా సహాయ కార్యదర్శి, బగ్గు భాస్కరరావు పాల్గొన్నారు.

21న మోడల్ స్కూల్ పరీక్ష

విశాలాంధ్ర-రణస్థలం: ఈనెల 20న జరగవలసిన ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల ఆరో తరగతి ప్రవేశంకై నిర్వహించాల్సిన పరీక్ష 21కి మార్చినట్లు రణస్థలం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పి శ్రీధర్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ పరీక్ష కు హాజరు కావలసిన విద్యార్థులంతా ఈనెల 21న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించబడునని ఆన్లైన్ లో అప్లై చేసిన చేసిన విద్యార్థులంతా హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎస్.ఎం.సి తీర్మానాలు త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడికి గురి చేస్తుందని, ఈ పనిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంటే విద్యాశాఖ అధికారులతో చేయించుకుంటే ఉపాధ్యాయులకు కొంత ఉపశమనం కల్గుతుందని యు.టి.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బమ్మిడి శ్రీరామమూర్తి అన్నారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ కూటమి ప్రభుత్వం 117జివోను రద్దు చేసి, దానికి ప్రత్యామ్నాయంగా ప్రాథమిక పాఠశాలలను, ప్రాథమికోన్నత పాఠశాలలను కుదించి, ఎత్తివేయాలని ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఒక ప్రక్క విధ్యార్థులకు పరీక్షలు జరుగుతుండగా ఎస్ఎంసి తీర్మానాలు చేసి, అప్లోడ్ చేయమని ఒత్తిడి చెయ్యటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతీ గ్రామంలో బేసిక్ ప్రైమరీ స్కూల్ అంటే ఒకటి నుండి ఐదు తరగతులు నిర్వహించాలని, అన్ని పంచాయితీ కేంద్రాల్లో కూడా మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేసి, తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఐదు తరగతులకు, ఐదు తరగతి గదులు, మౌలిక వసతులు చేయాలని కోరారు. మోడల్ ప్రైమరీ స్కూల్ పేరుతో పంచాయితీలో ఉన్న అన్నీ స్కూళ్ళను ఫౌండేషన్ స్కూళ్ళుగా మార్చటం సరైన ఆలోచన కాదన్నారు. దీని ద్వారా ప్రైవైటు పాఠశాలలకు చేయూత ఇచ్చినట్లు అవుతుందని, అలాగే ప్రస్తుతం ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను అవకాశం ఉన్న దగ్గర 60+ఉంటే, హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసి, మిగతా ప్రాథమికోన్నత పాం ఃశాలలను స్కూల్ అసిస్టెంట్‌తో యధావిధిగా కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని, బలహీన పరచరాదని జిల్లా యుటిఎఫ్ శాఖ డిమాండ్ చేస్తుందన్నారు.

లిట్ ఫెస్ట్ గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-టెక్కలి: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 23, 24 తేదీల్లో జాతీయ స్థాయి సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వరరావు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జాతీయ స్థాయి లిట్ ఫెస్ట్ గోడపత్రికను కళాశాలలో ఆవిష్కరించినట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. డిగ్రీ, పిజి స్థాయి విద్యార్థుల్లో సాహిత్య పరంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయుటకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పోటీల్ల భాగంగా ఫ్లాష్ ఫిక్షన్ (200-300పదాలు), స్క్రీన్ రైటింగ్ (చిన్న స్క్రిప్ట్లు), లిటరేచర్ క్విజ్, ఫిల్మ్ రివ్యూ ఛాలెంజ్ (5 నిముషాల సమీక్ష), డ్రామాటిక్ పెర్ఫార్మెన్స్ (నటన లేదా కవిత్వ పఠనం, కవితా రచనలు వంటి వివిధ అంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు వివరించారు. ప్రారంభ సమావేశంలో ఐఐటి భువనేశ్వర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజ్కుమార్ గుడూరు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఎంపిక చేయబడిన అంశాలను డిఒఐ, ఐఎస్బిఎన్ నంబర్లతో అధ్యయన పుస్తకాన్ని ప్రచురిస్తారని, విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, బివిఎస్ఇండ్ హెచ్ విభాగాధిపతులు డాక్టర్ రత్నమణి, డాక్టర్ ఎం.రమణయ్యలతో పాటు డాక్టర్ పాపినాయుడు, నడిమింటి శైలజల పర్యవేక్షణలో జరుగుతాయని డైరెక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు.

సైబర్ మోసగాళ్ల ఉచ్చులో మందస యువకుడు

రూ.60,000 కోల్పోయిన బాధితుడు

విశాలాంధ్ర-మందస: సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి మందస గ్రామానికి చెందిన శ్రీనివాస్ పాడి 60 వేల రూపాయలు చేజార్చుకుని తనకు జరిగిన మోసాన్ని పోలీసులు దృష్టి కి తీసుకువెళ్లాడు. మందస కొత్త వీధిలో నిరుద్యోగి శ్రీనివాస్ పాడి ఆన్ లైన్ సెంటర్ మరియు వీడియో గ్రాఫర్ గా జీవనాన్ని సాగిస్తున్నాడు. మంగళవారం పోలీస్ స్టేషన్ నుండి ఎస్ఐ మాట్లాడుతున్నారు అంటూ 7569341175 సెల్ నెంబర్ నుండి ఫోన్ వచ్చింది రూ. 60,000/- ను 954274782 నెంబర్ కు ఫోన్ పే పంపాలని కోరారు. దీనికి నెట్ సెంటర్ వ్యక్తి అరగంట వరకు స్పందించకపోవడంతో, శ్రీనివాస్ పాడి పక్క షాపు యజమానికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు శ్రీనివాస్ పాడికి ఫోన్ ఇవ్వాల్సిందిగా కోరారు. ఆ షాపు యజమాని శ్రీనివాస్ పాడికి ఫోన్ ఇచ్చాడు. అత్యవసరంగా రూ. 60,000/- ఫోన్ పే ద్వారా పంపండి అని, కమిషన్ ఎంత కావాలో అంత ఇస్తామని కోరారు. దీంతో నిజమే నమ్మిన శ్రీనివాస్ పాడి రూ.60000 ఫోన్ పే చేశారు. తాను ఫోన్ పే ద్వారా పంపిన డబ్బులు కోసం మందస పోలీస్ స్టేషన్ కు వెళ్లిన శ్రీనివాస్ పాడి ఇది సైబర్ నేరగాళ్ల పని అని పోలీసులు నిర్ధారించారు. తాము 60 వేల రూపాయలు అడగడం ఏమిటి? నువ్వు ఫోన్ పే ద్వారా మాకు పంపడం ఏమిటని పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ పాడి తనకు ఫోన్ వచ్చిన నెంబర్ కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోంది . ఈ ఘటనపై మందస పోలీస్ స్టేషన్ కు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది.

ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర-పలాస: ఆర్టిసి సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, సర్క్యులర్ 1/2019 ను తక్షణమే అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. పలాస ఆర్టీసీ డిపో వద్ద గురువారం ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లు అక్రమ రిమూవల్స్ ను ఆపాలన్నారు. గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్స్ ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. నాన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇహెచ్ ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. 114 జీవోలో పొందిన పరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సును 150 నుంచి 400 వరకు చెల్లింపులు చేయాలన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలని, తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని డిమాండ్ చేశారు. డిప్టేషన్లను యధావిధిగా కొనసాగించాలని, ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈఓఎల్ లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి వాలి, డి ఎల్ నారాయణ, ఎ వి రావు, టి డి రావు, టి పార్వతీశం, ఎన్ నారాయణ, వై అప్పయ్య హెచ్ వి మూర్తి డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ కోర్స్‌లో బోరుభద్ర ఉపాధ్యాయుడు ప్రతిభ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సమగ్ర శిక్ష, లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ, క్వెస్ట్ అలయన్స్ సంస్థలు సంయుక్తంగా సర్కార్ పాఠశాలల్లో కోడింగ్ పాఠాలు బోధించేందుకు మెరికల్లాంటి ఉపాధ్యాయులను తయారు చేసేందుకు నిర్వహించిన అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ కోర్స్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోరుభద్రకి చెందిన తాడేల లోకేశ్వరరావు ఉత్తరాంధ్రలో మొదటి పది స్థానాల్లోపు నిలిచి లాప్ టాప్ బహుమతిగా పొందారు. తాను పొందిన లాప్‌టాప్‌ను నిరుపేద విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించే సదుద్దేశ్యంతో, పాఠశాలలో ఉపయోగించాలని కోరుతూ ప్రధానోపా ధ్యాయులు పి.రామకృష్ణకు బోరుభద్ర హైస్కూల్లో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయిలో పాఠశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేసిన లోకేశ్వరరావును ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిలా ఉండాలని, నేటి ఉపాధ్యాయులు లోకేశ్వర రావు లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రతిభ చూపి బహుమతిగా పొందిన ల్యాప్ టాప్‌ను నిస్వార్థంగా పాఠశాలకు అందజేసిన లోకేశ్వరరావు ఉదారతను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గన్నవరపు గోవిందరావు, ఉపాధ్యాయులు, డి.ఉమా శంకర్, వెంకట రెడ్డి, కె.త్రినాధరావు, బాడాన రాజు, డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయ లక్ష్మి, బి.నాగమణి, కె.తవిటి రెడ్డి, బి.రజని, జి.జగదాంబ, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, శంకర రావు, గోపాలరెడ్డి, కమల కుమారి, సుశీల దేవి, సాయి శివాని, కృష్ణ, త్రివేణి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

విశాలాంధ్ర-కవిటి: కుసుంపురం గ్రామానికి చెందిన మృదంగ విద్వాంసుడు ప్రొపెసర్ డాక్టర్ బొంతలకోటి వరప్రసాద్ ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కవిటి మండల కేంద్రంలో గల కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, ఏపీ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీతంలో ఉద్ధానానికే వన్నె తెచ్చావని కొనియాడారు. అనంతరం మృదంగ ప్రొఫెసర్ డాక్టర్ వర ప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సంగీతం మనోవికాసానికి నాంది అని మానసిక ఒత్తిడి తగ్గిస్తుందని ఎంత అలసటలో ఉన్న ఆక్సిజన్ల పని చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్గా ఎంపికైన లోళ్ల రాజేష్ కు సాల్వాతో ప్రొఫెసర్ ప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండవ చంద్రశేఖర్, పూడి వెంకటేశం, చీకటి. కృష్ణయ్య, బొర్ర హరి, ఆరంగి వెంకటరావు, బల్లెడ రమేష్, చలపరాయి రవి, రాంబాబు, ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఏవో రాణి, సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో యువజన విభాగం కీలకం కావాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: వచ్చే ఎన్నికల నాటికి గ్రామ స్థాయిలో వైసిపి యువజన విభాగం కీలకం కావాలని పోలాకి జెడ్పీటీసి, డా.ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. గురువారం వైసిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల యువజన విభాగం కమిటీల పరిచయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డా.కృష్ణచైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా, ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయటంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. జగనన్న ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుందని, ఎన్నికలు ఎప్పుడు పెట్టినా రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని తెలిపారు. ఈ సారి పనిచేసే కార్యకర్తలకు పట్టం కట్టే విధంగా పాలన ఉండబోతుందని స్వయంగా జగనన్నే తెలిపారని, గ్రామస్థాయిలో వైసిపి ప్రతిష్ట పెంచేలా యువజన విభాగం సభ్యులు పనిచేయాలని కృష్ణచైతన్య కోరారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల యువజన విభాగం కమిటీ సభ్యులను శాలువలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో దండి జయప్రకాష్, బుద్దల రాజశేఖర్, జుత్తు నేతాజీ, రెంటికోట త్రినాధరావు, కొండాల బాబూ రావు, తోట భార్గవ్, పొట్నూరు పృథ్వీ, తంగుడు అరుణ్‌దీప్ పాల్గొన్నారు.

నేడు జీరుపాలెంలో విపత్తులపై అవగాహన సదస్సు



విశాలాంధ్ర-రణస్థలం: ఎస్‌డీఆర్‌ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ) వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9.00 లకు రణస్థలం మండలం జీరుపాలెం గ్రామం లో మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతుందని తాసిల్దార్ ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్, అగ్ని ప్రమాదం వగైరా ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కోవడం, నష్టం నివారణ గూర్చి తీసుకొనే చర్యలు పై ప్రజలకు అవగాహన కార్యక్రమం, మాక్ డ్రిల్, నమూనా నిర్వహణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో గల అన్ని శాఖల అధికారులు పాల్గొంటారు. వారు తీసుకొనే చర్యలు ప్రాక్టికల్‌గా తెలియచేస్తారు. ఈ సమావేశంలో డిప్యూటీ తాసిల్దారు డి నారాయణ మూర్తి అగ్నిమాపక అధికారి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శామ్యూల్ హనీమూన్ జయంతి

విశాలాంధ్ర-కవిటి: ఘనంగా హెూమియోపతి వైద్య పితామహుడు క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనీమూన్ 270 జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జగతి శివాలయం ఆవరణంలో ఉన్న క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనీమూన్ విగ్రహానికి సోంపేట ఎంపీపీ, ప్రముఖ హెూమియో వైద్యులు నిమ్మన దాసు, కవిటి వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, స్థానిక సర్పంచ్ పూడి వరప్రసాద్ తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోంపేట ఎంపీపీ డాక్టర్ ఎన్ దాస్ మాట్లాడుతూ హెూమియో హానికరం లేని వైద్య విధానంమని తెలిపారు. హెూమియోను దేశీయ వైద్యంగా భావిస్తారని దీర్ఘకాలిక వ్యాధులే కాదు కాలానుగుణంగా జబ్బులను సైతం నేటిగా నాణ్యతగా పనిచేసే హెూమియో వైద్యం అని

తెలిపారు.పసిపిల్లల ప్రాణాలను రక్షణ కవచంగా నిలిచిందన్నారు. హెూమియో మందులను ఎటువంటి దుష్ప్రభావం లేకుండా ధైర్యంగా వాడవ వచ్చునని, అల్లోపతి మందులు తింటూనే హెూమియోపతి మందులు కూడా వాడవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో హెూమియో వైద్యులు దుర్గాప్రసాద్ పట్నాయక్, అనురాధ, సుబ్బారెడ్డి,గోవింద్,గ్రామస్తులు భావన సీతారామమూర్తి, పూడి వెంకటేశం,పూడి హరి నారాయణ,దిక్కల బాబురావు,భావన నారాయణ మూర్తి, తమరాల హరినాథ్, పిరియా జోగయ్య, పూడి వంశీ, బార్ల జగన్నాథం, భావన సత్యం, బొర్ర హరి, బొర్ర బాలరాజు, గంతి శ్రీనివాసులు, బార్ల జోగారావు, సమల్లా పద్మనాభం, గుడియా సంతోష్, ముద్దపు తేజేశ్వరరావు, లమ్మత వేణు తదితరులు పాల్గొన్నారు.

వంజంగిలో సీతారామస్వామి మందిర ప్రతిష్ట

విశాలాంధ్ర-ఆమదాలవలస: శ్రీ హనుమత్ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామి మందిర ఉత్సవ విగ్రహ యంత్ర ప్రతిష్ట మహోత్సవం మండలంలోని వంజంగి గ్రామంలో శుక్రవారం నుంచి 13వ తేదీ ఆదివా రం వరకు నిర్వహించబడునని ఆలయ పునర్‌నిర్మాణ కర్త బెండి గోవిందరావు తెలిపారు. శుక్ర వారం ఉదయం విగ్రహ ఊరేగింపు పతాక ప్రతి ష్ట, నీరాజనం మంత్ర పుష్పములు, ప్రసాద విత రణ ఉంటుందన్నారు. 12వ తేదీ శనివారం

మంత్రజపములు, షోడశోపచార పూజలు, అష్టదిగ్బంధన, మూల మంత్ర వాహనములు నీరాజనాలు ఉంటాయన్నారు. ఆదివారం 13వ తేదీన జయాది హెూమములు మూలమంత్ర హెూమములు, నిజరూప, సర్వదర్శనములు శ్రీ సీతారామ కళ్యాణ పూర్ణాహుతి జరుగుతుం దని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు వివరించారు. కళ్యాణం చేయు దంపతులు కమిటీ వారిని సంప్రదించి పూజా సామాగ్రి తో హాజరుకావాలని తెలిపారు.

విశాలాంధ్ర
పేజీ: 3
శ్రీకాకుళం
శుక్రవారం 11, ఏప్రిల్, 2025

నేషనల్ ఇండియన్ టాలెంట్ టెస్ట్ లో అడ్డపనస విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం అడ్డపనస బాపూజీ విద్యా కేంద్రం విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు 2024 25 ఫైనల్ రెండు ఇండియన్ ఎగ్జిబిషన్లో ప్రథమ స్థానాన్ని ద్వితీయ స్థానాన్ని సంపాదించుకోవడం ఆనందాయకమని పాఠశాల వ్యవస్థాపకులు జై పుణే మాస్టర్ తెలిపారు. ఈ పరీక్షల్లో మెట్ట జాన్వి, జుత్తు నవీన్, వెలమల కౌస్ ప్రథమ ద్వితీయ స్థానాలు సంపాదించడం గర్వకారణంగా ఉందని మాస్టర్ తెలిపారు. ఆల్ ఇండియాలో ఇటువంటి స్థానాన్ని సంపాదించడం ఉపాధ్యాయ సిబ్బందితోపాటు విద్యార్థుల కృషి అని ఆయన అన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రా పేరిట నోట్ బుక్కులు విద్యార్థులకు పంపిణీ చేస్తుంది. ఇందులో భాగంగా మండలంలోని కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం కళాశాల ప్రిన్సి పాల్ కీర్తి తవిటినాయుడు నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస కాలు విద్యార్థులకు పంపిణీ చేయడం వరమన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా విద్యార్థులకు అం దజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సనపల షణ్ముఖరావు, నడిమింటి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యలో నైపుణ్యం అవసరం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: వృత్తి విద్యలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల ప్రిన్సిపాల్ బి. లక్ష్మి అన్నారు. ఈ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 9,10 తరగతులు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సులు నిర్వహిస్తున్నామని చె ప్పారు. వొకేషనల్ కోర్సుల్లో సాధించిన ప్రావీణ్యంతో ఉజ్వల భవిత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వొకేషనల్ కన్సల్టెంట్ బి. రాజశేఖర్, జీసీడీవో నీరజాక్షి, వొకేషనల్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతిరావు, స్కూల్ వొకేషనల్ టీచర్ తమ్మినేని నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్, కళాకారుడు సత్య వరప్రసాద్ కు ఘన సత్కారం.



విశాలాంధ్ర-కవిటి: మండలంలోని జగతి పూడి వీధిలో శ్రీరామనవమి సందర్భంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, మృదంగ కళాకారుడు బొంతల కోటి సత్య వరప్రసాద్ కు ఘన సత్కారం చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్న సందర్భంగా మృదంగ కళాకారుడు బొంతల కోటి సత్య వరప్రసాద్ కు అలాగే ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ కు పూడి వీధి వాసులు, జగతి గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పండి డిల్లేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్ పెద్ద ఆయుధం

పెందుర్తి సిఐ సతీష్ కుమార్

విశాలాంధ్ర-పెందుర్తి : ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ మహిళల భద్రతకు పెద్ద ఆయుధమని పెందుర్తి సిఐ కె. సతీష్ కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ 97 వ వార్డు చినముషిడివాడ, అమృత నర్సింగ్ కాలేజ్ విద్యార్థులకు శక్తి యాప్ గురించి గురువారం పెందుర్తి పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ,"శక్తి యాప్" మహిళల భద్రతకు ప్రభుత్వం రూపొందించిన అత్యవసర సహాయక ఆయుధమని తెలిపారు. ఈ యాప్ ను తమ మొబైల్ ఫోన్లో ఇన్స్టాల్ చేసుకున్న మహిళలు అత్యవసర పరిస్థితుల్లో ఒక్క క్లిక్‌తో పోలీస్ సహాయాన్ని పొందవచ్చని వివరించారు. ఈ యాప్ ద్వారా జిపిఎస్ ఆధారంగా స్థానిక పోలీస్ పెట్రోలింగ్ టీం తక్షణమే సంఘటన స్థలానికి చేరుకొని సహాయం అందిస్తుందని వెల్లడించారు. అలాగే ఆకతాయిల వేధింపులు, అనుమానాస్పద పరిస్థితులు, ఒంటరిగా ప్రయాణించే సమయంలో భయాందోళన కలిగినపుడు, ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. మహిళలు యువతులు విద్యార్థులు తప్పనిసరిగా శక్తి యాప్ను తమ ఫోన్లలో ఇన్స్టాల్ చేసుకోవాలని సీఐ సూచించారు. ఫోన్లో వాల్యూమ్ బటన్‌ను వరుసగా మూడుసార్లు నొక్కడం ద్వారా ఎస్ ఓ ఎస్ అలర్ట్ పంపవచ్చు అని విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కాలేజ్ ఫ్యాకల్టీ మెంబర్లు విద్యార్థినులు పాల్గొన్నారు.

తోబుట్టువుల దినోత్సవం

విశాలాంధ్ర-తగరపువలస: స్థానిక ఒకటవ వార్డు, జి.వి.యం.సి ప్రాథమిక పాఠశాల బంగ్లామెట్ట నందు ఉపాధ్యాయుడు రెడ్డివల్లి అప్పలరాజు విద్యార్థులకు తోబుట్టువుల దినోత్సవ ప్రాధాన్యతను గురించి తెలిపారు. అక్కంటే ఆప్యాయత , అన్నంటే అనురాగం, చెల్లె అంటే అనుబంధం , తమ్ముడు అంటే ఆత్మ బంధం అని పాఠశాలలో ఉన్న అన్నదమ్ములు అక్క చెల్లెలలను ఒకచోటకు చేర్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని తమ అనుబంధాన్ని చాటి చెప్పేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఒకరు బాధ పడితే మరొకరు కంటతడి పెడతారని నిజమైన తోబుట్టువుల బంధానికి ఇదొక నిదర్శమని తెలియజేశారు. ...

ఘనంగా 'రవీంద్రభారతి'లో కిడ్స్ కాన్వోకేషన్

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక పెద్దపేట వీధిలో ఉన్న రవీంద్రభారతి పాఠశాలలో గురువారం కిడ్స్ కాన్వోకేషన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గైనకాలజిస్ట్ డా.చల్లా కృషి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, వారి బంగారు భవిష్యత్తును తీర్చి దిద్దే దిశగా పాఠశాలలు కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, ధర్మాన వాసుదేవరావు మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకశక్తి, సామర్థ్యాలు వెలికి తీయటానికి తోడ్పడే విధంగా ఈ విద్యా విధానం అమలు చేసి, తద్వారా వారి భావి జీవితానికి మెరుగులు దిద్దటం జరుగుతుందని తెలిపారు. ఈ సంధర్భంగా చిన్నారులు నిర్వహించే నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నార్త్ ఆంధ్రా జోనల్ ఇంఛార్జ్, వెంకటేష్, సి.జి.యం, వసంత, జి.ఎం, కె.రమ్య, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, చిన్నారుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

బాలబాలికలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి

విశాలాంధ్ర-కవిటి: ఐదు సంవత్సరాలు నిండిన బాల కాలికలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని బొరివంక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయు లు గుంటుకు శ్రీధరరావు, ఎస్ఎంసీ చైర్మన్ బృందావన్ బిసాయి అన్నారు.ఈ మేరకు గురువారం బొరివంకలోని ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వేతనదారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యతో పాటు వివిధ సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతీ పంచాయతీలో మోడల్ పాఠశాలను పెట్టి ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడుని నియమించనున్నట్లు తెలిపారు.

ప్రజలందరూ ఉపాధి హామీ పనులు ఉపయోగించుకోవాలి

విశాలాంధ్ర-టెక్కలి: గ్రామ ప్రజలందరూ ఉపాధి హామీ పనులు ఉపయోగించు కోవాలని ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమం, అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరవు యాదవ్ అన్నారు. మండలంలోని రావివలసి పంచాయతీ చిన్ననారాయణపురం బొడ్డరాముడు చెరువులో ఉపాధి హామీ పనులను గురువారం ఆయనతోపాటు టిడిపి నాయకులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలస కూలీలను నివారించేందుకు కూటమి ప్రభుత్వం ఉపాధి పనులు చేపట్టిందని, దీన్ని గ్రామ ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. ఎండాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకొని పనులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావివలస మాజీ సర్పంచ్ బడే జగదీశ్, మాజీ ఎంపీటీసీ నర్తు కృష్ణారావు, ఏపిఓ ప్రసాద్రావు, ఫైల్డ్ అసిస్టెంట్, మేట్లు దాసరి శ్రీనుబాబు, దాసరి వాసు, తురక మల్లేష్, తురక కృష్ణారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పినగాడిలో శ్రీముత్యమాంబను దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర-పెందుర్తి: పెందుర్తి మండలం పినగాడిలో శ్రీ ముత్యమాంబ అమ్మవారి పండుగ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. నిర్వాహకుల ఆహ్వానం మేరకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో శ్రీ ముత్యమాంబ అమ్మవారిని దర్శించుకుని ఎన్నికల ప్రచారం ప్రారంభించామని అమ్మవారి ఆశీస్సులతో ఘన విజయం సాధించినట్లు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శ్రీ ముత్యమాంబను ప్రార్థించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కర్రీ కనకరాజు, కొరుపోలు రామ, సీనియర్ నాయకులు ఇందుల రమణ, బలిరెడ్డి అప్పారావు, మామిడి శంకర్ రావు, బయలపూడి హర గోపాల్, రోమాల చంద్రశేఖర్, పల్లా తాతారావు, బోకం సోము నాయుడు,కిల్లి వెంకట సత్యనారాయణ, పెంట బాబ, రామ్ కుమార్, బంతకోళ్ల పద్మ, రాజేష్, అయితే సింహాచలం, నేటిపల్లి మహేష్, రాపర్తి కిషోర్ సహా గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు పట్టవా...!

- పట్టణాభివృద్ధికి ఏవీ ప్రణాళికలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: పురపాలక సంఘం పట్టణ ప్రధాన రహదారి గుండా ఫుట్ పాత్ ఆక్రమణలకు గురౌతున్నా కనీస చర్యలు చేపట్టే దాఖలాలు లేవు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత వైసిపి వారు ఆక్రమించుకున్న వాటిలో కొన్నింటిని తొలగించి అంతకంటే మించి దురాక్రమణలు చేశారు. ఎమ్మెల్యే రవికుమార్ ఆక్రములను తక్షణం తొల గించాలని తన పర్యటనలో అధికారులను ఆదే శించినప్పటికీ కనీస చర్యలు లేవు. రోజు రోజుకి ఆక్రమణలు పెరుగుతున్నాయే తప్ప తొలగించి న పాపాన పోలేదు. ఒకవేళ అటువంటి చర్య లకు అధికారులు ఉపక్రమించినప్పటికీ కేవలం కక్షపూరితంగానే మమా అనిపిస్తున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. ప్రత్యేక ప్రణాళికల ద్వా రా పట్టణాభివృద్ధి కి చర్యలు తీసుకుంటామని ఉపన్యాసాలే తప్ప కార్యాచరణ అటువైపుగా లేదు. రోజురోజుకీ పెరుగుతున్న జనాభా కార ణంగా మార్కెట్ రద్దీ అవుతుంది. దృష్టిలో పెట్టుకొని రోడ్లు విస్తరించాల్సిన పాలకులు అధి కారులు ఆక్రమణలకు తావిస్తున్నారు అన్న వి మర్శలు లేకపోలేదు. పట్టణం కృష్ణాపురం నుం చి ఇందిరా గాంధీ విగ్రహం వరకు ఇటువంటి ఆర్ విగ్రహం అటు రాజశేఖర్ విగ్రహం వరకు పెచ్చు మీరి దురాక్రమములు చేస్తున్న కనీస చర్యలు చేపట్టే దాఖలాలు లేవు. ఇటీవల స్థా నిక ఎమ్మెల్యే కూన రవికుమార్ మున్సిపాలిటీ పర్యటనలో భాగంగా డ్రైనేజీ పై ఉన్న ఆక్రమ ణలను తొలగించాలని అప్పటి అధికారులకు ఆదేశించారు. జూనియర్ కాలేజ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు పర్యటించి పలువురు షాపు య జమానులకు సమయం ఇచ్చి వారు ఆక్రమించే వాటిని తొలగించుకోవాలని స్పష్టం చేశారు. పాత స్టేట్ బ్యాంకు వద్ద ఉన్న దురాక్రమలను తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదే శించేలోగా స్థానిక నాయకుడు చెవిలో మాట చెప్పి అక్కడినుండి పర్యటనను ముగించారు. దురాక్రమంలో నన్ను తొలగించడంలో నాయకు లలో చిత్తశు ద్ధి కరువైంది అన్నది తేటతెల్లమవు తుంది. పట్టణ ప్రధాన మార్కెట్ కూడలి వద్ద ఫుట్ పాత్ వ్యాపారులు భవన యజమానికి రోజువారి మామూలు తో పాటు మార్కెట్ ఆసీ లు కడుతున్నారు. మరి కొంతమంది వారు ఆక్ర మించుకున్న స్థలానికి కిస్తీ కట్టి ఆ స్థలం తమ దిగా వ్యాపారం చేస్తున్నారు. ఇదేమని మున్సి పల్ అధికారులను అడిగితే ఇంక్రోచ్మెంట్ లో ఉన్న వాటిని ఆ అవసరం వస్తే తొలగిస్తామని అంతవరకు వారి వినియోగించుకునేందుకు కిస్తీ కట్టించుకుంటున్నామని దీంతో మున్సిపల్ ఆదాయం మెరుగవుతుందని బదులిచ్చారు. కోటి కాంప్లెక్స్ లో ఇటీవల షీల్డ్ తొలగింపులో ఆ ప్రాంతాన్ని మొత్తం తొలగించారు. ఇదే అదును గా ఫుట్ పాత్ ఆక్రమణతోపాటు గ్రిల్స్ ఏర్పాటు చేసి వ్యాపారం కొనసాగిస్తున్నారు. పట్టణంలో ని టిడిపి కార్యాలయానికి అతి చెరువులో ఫుట్ పాత్ పై డిబ్రిస్ నిల్వలు ఉంచారు. పెద్ద చెరువు గేటు కాలువ వద్ద ఓ కౌజు పిట్టల వ్యా పారి రోడ్డుపైకే తన వ్యాపారాన్ని విస్తరించాడు. అప్పటికే కాలవపై భవనము నిర్మించి అది చాలదన్నట్టు రోడ్డుపైకే వ్యాపారాన్ని పెంచు కుంటూ వచ్చారు. ప్రధాన రహదారికి అనుకుని ఉన్న వ్యాపారులు కొనుగోలుదారులును ఆక ట్టుకునేందుకు వీలుగా ఫ్లెక్సీలు బ్యానర్లతో రోడ్డుపై ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రయాణి కులకు అసౌకర్యాన్ని కల్పిస్తున్నారు. కూరగా యల మార్కెట్ వద్ద వాహనాల రాకపోకల తో పాటు ప్రయాణికులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. ఆదాయం వస్తుందిలే అని అధి కారులు గతంలో ఇలాగే ఉంది కదా అని పాల కులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ వారి అనుయాయులు ఆక్రమించు కునేందుకు వీలుగా విమర్శలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. నేతల బహిరంగ విమర్శలకు క్షేత్రస్థా యిలో జరుగుతున్న పనులకు తేడా లేకుండా పోయిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. గత వైసిపి పాలనలో చెరువు గర్భాలను ఆక్ర మించుకునే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసు కుంటామంటూ మూడు రోజులపాటు జెసిబి లను రోడ్లపై ఉంచిన అధికారులు చర్యలు చేపట్టిన పపాన పోలేదు. నేతల బుల్డోజ్ వ్యాఖ్యలకు అభిమానులు కేరింతలు కొట్టారు. కానీ అక్కడ నిర్మాణ యజమానులు మాత్రం కోర్టును ఆశ్రయించి పూర్తి హక్కుల పొందారు. ఇలా ఆక్రమణదారులంతా ఏదో ఒక సంద ర్భంలో వాటిపై పూర్తి హక్కులు పొందటం జరుగుతోందన్న ప్రచారంవుంది. ఆక్రమణలపై అటు పాలకులు ఇటు అధికారులు సమన్వ యంతో పనిచేసి పట్టణ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఫుట్పాత్ పైనే గ్రిల్స్ ఏర్పాటు, కౌజు పిట్టల వ్యాపారం చేసిన దృశ్యం

కాలవ కప్పేసి... గట్టును రోడ్డు చేసి

- కొత్త రోడ్డు ఆవరణలో ఆక్రమణలు...

- చోద్యం చూస్తున్న అధికారులు...

కాలవ కప్పేసి రోడ్ వేసిన దృశ్యం

విశాలాంధ్ర -ఆమదాలవలస: ఆక్రమణకు కాదేది అనర్హం అన్నట్లు తెలుగు తమ్ముళ్ల తీరు తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆక్రమణదారుల అక్రమాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. అక్కివరం పంచాయతీ పరిధిలో కొత్త రోడ్డు వద్ద గల ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో కాలువ కప్పేసి గట్ల ఆక్రమించి రోడ్డు వెసెసారు.అధికార పార్టీ నాయకులు ఆక్రమణలు చేసేందుకు ఏ కంగా కాలువ గట్టునే రోడ్డుగా చేసేసారు. దీంతో ఎగువ నుండి దిగువ పొలాలకు సాగునీరు అందించే కాలవను కప్పేశారు. దీంతో దిగువ పొలాలకు సాగునీరు అందదు సరి కదా ప్రకృతి విపత్తుల సంభవించినప్పుడు వరదలు తుఫా నులు వచ్చినప్పుడు కాల్వ కప్పేయడంతో నీరు వెళ్లేందుకు అవకాశం లేదని భవిష్యత్తులో విజ యవాడ మాదిరిగా ఈ ప్రాంతం ముంపు గురై ప్రమాదం ఉందని సాగునీటి నిపుణులు అభి ప్రాయపడుతున్నారు. 2014 హుదూద్ తుఫాన్ తాకిడికి ఈ ప్రాంతం పూర్తిగా ముంపునకు గురై సుమారు నెలరోజుల పాటు శ్రీకాకుళం ఆముదాలవలస రాకపోకలు నిలిచిపోయా యి. ఇటువంటి పరిస్థితులను అయినా దృష్టి లో ఉంచుకొని కాలవలు మూసి వేయ రాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉండటంతో విద్యాసంస్థలు వ్యాపార సంస్థలు గృహాలు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. ఈ ఆక్రమాలపై దృష్టి సాధిం చవలసిన సచివాలయ సిబ్బంది, రెవిన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు దృష్టి సారించక పోవడంతో ఇక్కడ ఆక్రమణలు వేగంగా జరు గుతున్నాయి. మాముళ్ళ మత్తులో అధికారు లు జోగుతుండడంతో ఆక్రమణలు జోరందు కున్నాయి. యంత్రాంగం నిర్లక్ష్యానికి సిగు నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కోవలసిన దుస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా జిల్లా కలె క్టర్, జిల్లా రెవిన్యూ సిబ్బంది, దృష్టి సారించి రానున్న ప్రకృతి విపత్తులను, భవిష్యత్తు తరా లను దృష్టిలో ఉంచుకొని ఆక్రమణలు తొలగిం చాలని పరిసర ప్రాంత రైతులు ముక్తకంఠంతో కోరుచున్నారు.

విక్రంపురంలో బిజెపి నాయకులు పర్యటన

విశాలాంధ్ర-టెక్కలి: బిజెపి పార్టీ ఆవిర్భవించి 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మండలంలోని విక్రాంపురం గ్రామంలో బిజెపి నాయకులు పర్యటించి, గావ్ చలో.. బస్తీ చలో మరియు పల్లెకు పోదాం అనే కార్యక్రమం మండల అధ్యక్షులు జర్జన రాంజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి మాట్లాడుతూ ఎండ తీవ్రతపై తగు జాగ్రత్తలు తీసుకుంటూ పని చేసుకోవాలని తెలిపారు. పని ప్రదేశాలలో ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నిర్వహించి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో బిజెపి జెండాలతో ర్యాలీ నిర్వహించి అంగన్వాడి, పాఠశాలలను సందర్శించారు.

పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందించాలని సిబ్బందికి తెలిపారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మౌలిక వసతులు ఏవైనా లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు తెలిపారు. చిన్నారులకు విద్యార్థులకు త్రాగునీరు సమస్య ఉందని సిబ్బంది తెలిపారు. వేసవి దృష్ట్యా ఎండాకాలంలో తప్పనిసరిగా త్రాగునీరు అవసరమని త్వరలోనే ఉన్నతాధికారులకు తెలియపరచి పిల్లలకు త్రాగునీరు అందించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోర్చ జిల్లా అధ్యక్షుడు జన్ని పరమేశ్వరరావు, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి, స్వచ్ఛభారత్ కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు, నియోజకవర్గం కో బికన్వీనర్ నడిపూరు లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శిలు నేతింటి రాజారావు, శాసనపూరి శ్రీను, యువ మోర్చా మండల అధ్యక్షులు సంపతరావు రమేష్ పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రపన్నారు

జనసేన నేత పీతల మూర్తి యాదవ్ విమర్శ

విశాలాంధ్ర-విశాఖ సిటీ : మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కుట్రపన్నారని జనసేన నేత పీతల మూర్తి యాదవ్ విమర్శించారు. గురువారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహనరెడ్డి పోలీసులు పట్ల అనుచిత వ్యాఖ్యాలు చేయడం దారుణమన్నారు. రాజకీయాలను భ్రష్టుపట్టించేలా, సభ్యసమాజం సిగ్గుపడే విధంగా జగన్ మాటలు ఉన్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర కీర్తి ప్రతిష్టలు భంగం కలిగించేలా జగన్ మాట్లాడుతున్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి భాషను వాడి, జగన్ తన స్థాయిని మరింత దిగజార్చుకున్నారన్నారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న పోలీసులు పై జగన్ వ్యాఖ్యలు సరికాదన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం లో పోలీసులను అడ్డు పెట్టుకుని ల్యాండ్, సాండ్, మైన్, వైన్ దోచుకొన్నారని విమర్శించారు. ఎన్నికలో రాష్ట్ర ప్రజలు 164 మంది వైసిపి అభ్యర్థులను బట్టలుడదీశారని ఎద్దేవా చేశారు. విజయసాయిరెడ్డి జగన్ బట్టలు ఇప్పటికే ఊడదీసాడన్నారు. జగన్ కి ఎక్కడ ఎం మాట్లాడాలో తెలియదని, దళిత ఆడబిడ్డ, పొలిట్ బ్యూరో సభ్యురాలు, రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. రాష్ట్రాన్ని జగన్ గంజాయి హబ్ గా మార్చితే హెూంమంత్రి అనిత గంజాయి పై ఉక్కుపాదం మోపుతున్నా రన్నారు. ఇప్పటికే లెవెన్ మోహన్ రెడ్డి గా పేరు తెచ్చుకున్నారు...ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో వైసిపి ఒక్క స్థానం మాత్రమే గెలుచుకొని సింగిల్ మోహన్ రెడ్డి గా మిగిలిపోతారని ఎద్దేవా చేశారు. టీడీపీ నేతలను నరికిపారేస్తామంటూ కారుమూరి చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వాదులు అందరూ ఖండించాలన్నారు.